క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ధన్వాడ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సద్గుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందని అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొనాలని సూచించారు.

ఇసుక తరలింపు : కేసు నమోదు

నారాయణపేట రూరల్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన మల్లేష్ తన ట్రాక్టర్, ట్రాలీకి నంబర్‌ప్లేట్ లేకుండా నడిపించడమే కాకుండా, అనుమతి తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న విషయాన్ని పెట్రోలింగ్ సిబ్బంది గమనించారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికల్లో గెలుపుపై ధీమా



నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి విజయం ఖాయమని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డిలు అన్నారు. ఎన్నికల అనంతరం సోమవారం సాయంత్రం వారు మాట్లాడుతూ.. నమ్మకాన్ని నిజం చేస్తూ వారికి అవసరమైన అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసిన పీఆర్‌టీయూ పక్షాన టీచర్లు నిలబడ్డారని, భవిష్యత్‌లో వారి అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తామని, అందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. లక్ష్మారెడ్డి, రఘువీర్, మొల్గాన్‌జనార్దన్, సత్యనారాయణరెడ్డి, విశ్వనాథ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : అసంపూర్తిగా మిగిలిపోయిన ఎన్నో సమస్యలను పరిష్కరించుకోవాలని కసితో ఉన్న ఉపాధ్యాయులు మార్పు కోసమే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటును వేశారని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నర్సింహా ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం మాట్లాడుతూ.. పండిత్, పీఈటీల ఉన్నతీకరణ ప్రక్రియకు మార్గాలు ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వాపోయారు. కేజీబీవీలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై కనీస పట్టింపు లేకుండా పోయిందని విమర్శించారు. వీటన్నింటికి మార్పుతోనే గుణపాఠం చెప్పాలని భావించి తపస్ బలపర్చిన వ్యక్తికి ఓటు వేశారని అన్నారు. బీజేపీ నాయకులు ప్రభాకరవర్ధన్, రఘువీర్‌యాదవ్, తపస్ నాయకులు గుంపుబాలరాజు, దూసాసీ తారాములు, కిశోర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



మాగనూర్(కృష్ణ): మండల కేంద్రంలోని క్షీర లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విజయప్పగౌడ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు ఇవ్వాలని ఆందోళన

అమరచింత: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సకాలంలో ఆసరా పింఛన్లు అందించి ఆదుకోవాలని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వామపక్షాల నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 5వ తేదీ లోపు ఆసరా పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరంలో ఒక నెల పింఛన్ ఇవ్వటం లేదని వాపోయారు. కుటుంబ సభ్యుల ఆదరణ లేని వారికి పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ఇప్పటికైనా సకాలంలో ఆసరా పింఛన్లు చెల్లించాలని ఎంపీఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, బుచ్చన్న, సామేలు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కీర సాగుతో అధిక లాభాలు

- ఆసక్తి కనబరుస్తున్న రైతులు
- మండలంలో 150 ఎకరాల్లో సాగు

ఊట్కూర్: వేసవికాలంలో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతులు పలు రకాల వాణిజ్య పంటలపై మక్కువచూపుతూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఊట్కూర్ మండలంలో తక్కువ నీరు అవసరమయ్యే కీరదోస సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. మండలంలోని మొగ్దంపూర్, బిజ్వార్, చిన్నపొర్ల, అవుసలోనిపల్లి, నిడుగుర్తి, లక్ష్మిపల్లి, పెద్దజట్రం, ఊట్కూర్ గ్రామాలలో 75 మంది రైతులు దాదాపు 150 ఎకరాల్లో కీరసాగు చేస్తున్నారు. మండలంలో 6 ఆరేళ్లగా ఈ సీజన్‌లో కీరసాగు కొనసాగుతోంది. విత్తనాలు, మందులు, ఎరువులు కలిపి ఒక ఎకరాకు దాదాపు రూ.15 వేల వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. 70 రోజుల వరకు పంట దిగుబడి వస్తుందని 35 రోజుల తర్వాత రెండు రోజులకు ఒకమారు దిగుబడి వస్తుందని చెబుతున్నారు. దాదాపు రెండు నెలలలో ఖర్చులు పోను ఎకరాకు రూ.30 వేల నుంచి రూ. 40 వేల వరకు లాభాలు వచ్చే అవకాశం ఉంటుదని అంటున్నారు. అదే విధంగా కీరసాగు వల్ల ఇటు కూలీలకూ ఉపాధి లభిస్తోందని చెబుతున్నారు.



మొగ్ధంపూర్‌లో సాగుచేసిన కీరదోస

మంచి ప్రత్యామ్నాయం

ప్రస్తుతం సీజన్‌లో భూగర్భజలాలు అడుగంటుతుండడంతో ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను పండించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కీరసాగు ఒక మంచి ప్రత్యామ్నాయంగా మారుతోంది. పంటకూడా తక్కువ రోజులలోనే చేతికొస్తోంది. ప్రస్తుతం రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నా. ఎకరాకు రూ.30 వేలు లాభం వచ్చే అవకాశం ఉంది.

–సి.మోహన్‌రెడ్డి, రైతు, ఊట్కూర్

తక్కువ నీటితో పండించవచ్చు

వేసవికాలంలో తక్కువ నీటితో ఆయిల్‌పాం, కీరదోస, పండ్లతోటలు, కూరగాయలు, వాణిజ్య పంటలు పండించడం వల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చు. మండలంలో 150 ఎకరాల్లో 75 మంది రైతులు కీర సాగుచేస్తున్నారు. రెండు నెలల్లో పంట కాలం పూర్తి అయ్యే అవకాశం ఉండడంతో ఆసక్తి కనబరుస్తున్నారు. కూలీలకూ ఉపాధి లభిస్తోంది.

–సంతోష్‌కుమార్, ఉద్యానవనశాఖ క్లస్టర్ అధికారి, ఊట్కూర్

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



మద్దూర్‌లో పోలింగ్ అనంతరం బాక్స్‌లను తరలిస్తున్న సిబ్బంది



మక్తల్‌లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ రాంచందర్

సాక్షి నెట్‌వర్క్ : హైదరాబాద్‌-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానానికి సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నారాయణపేటలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు పోలింగ్ ఏజెంట్లకు పాస్‌ల జారీ సమయంలో పోలింగ్ కేంద్రంలోనే అవగాహన రాహిత్యంతో పీఆర్‌టీయూ, తపస్ నాయకుల మధ్య వాగ్వివాదం జరిగింది. పీఓ సైతం ఏజెంట్ల పట్ల నిర్లక్ష్యంగా మాట్లాడటం, అమర్యాదగా ప్రవర్తించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఇక మొత్తం 341మందికి గాను 322మంది ఓటు వేయగా 94.43 పోలింగ్ శాతం నమోదు అయ్యింది. అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్, ఆర్డీఓ రాంచందర్ పరిశీలించారు. ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ సత్యనారాయణ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మక్తల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహించారు. 125 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆర్డీఓ రాంచందర్, అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సీఐ సీతయ్య, ఎస్‌ఐలు పర్వతాలు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. కోస్గిలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ తనిఖీ చేశారు. మండల పరిధిలో మొత్తం 88 ఓట్లుండగా 84 ఓట్లు పోలయ్యాయి. మండలంలో 97.67 శాతం ఓటింగ్ నమోదైంది. అదేవిధంగా డీఎస్పీ సత్యనారాయణ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలీస్ బందోబస్తును పరిశీలించారు. సీఐ జనార్దన్, ఎస్సై శ్రీనివాసులు ఉన్నారు. మరికల్ మండలకేంద్రంలో నిర్వహించిన పోలింగ్‌లో 57 మందికి గానూ 43 మంది ఓట్లు వేశారని అధికారులు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. మద్దూరులో 40 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ పరిశీలించారు. 93.02 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.



కోస్గిలో పోలింగ్ కేంద్రం వద్ద డీఎస్పీ సత్యనారాయణ



మరికల్ పోలింగ్ కేంద్రంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్



మద్దూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్ : మండలంలోని బైరంకొండ యూపీఎస్‌లో సోమవారం సాయంత్రం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల అభ్యున్నతికి చేయాల్సిన పనులను తెలియచేశారు. చక్కగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. వివిధ రకాలైన సాంస్కృతిక, క్రీడా పోటీల విజేతలైన విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు. అనంతరం నిర్వహించిన నృత్యాలు ఎంతో అలరించాయి. హెచ్‌ఎం కందికొండ కృష్ణయ్య, టీచర్లు విద్యావతి, బాలప్ప, స్నేహలత, మహేష్, గీత, అశోక్, పద్మావతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కరాటే టోర్నీలో విద్యార్థులకు పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే టోర్నీలో కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో మహ్మద్ అమాన్‌ఖాన్ బంగారు పతకంతో పాటు గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మహ్మద్ సాబేర్‌పాషా, మారియ, షేక్ అర్సలాన్, మునజ్జా, ఉస్మాన్, జవాద్ బంగారు పతకాలు, ఉజేష్ షరీఫ్, నస్రబేగం, మహ్మద్ ఖాజాపాషా, ఆది నవీన్‌కుమార్, ఫైసల్ రజత పతకాలు సాధించినట్లు వెల్లడించారు.

మజ్జిగ పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ డిపోలో సోమవారం ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్యూటీ ఆర్‌ఎం సత్యనారాయణ, డిపో మేనేజర్ సుజాతలు మజ్జిగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాంజీ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నిక్కరు ఒకటే... రంగులు రెండు

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న ఉచిత యూనిఫాంల విషయంలో బాధ్యుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఏకరూప దుస్తులను ఏజెన్సీ వారు, దర్జీలు ఇష్టారీతిన కుట్టి పాఠశాలలకు పంపించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకే రంగులో ఉండాల్సిన నిక్కర్లను రెండు వేరు వేరు రంగులతో కుట్టారని అంటున్నారు. మండలంలోని మద్దెల్‌బీడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అందజేసిన దుస్తుల పంపిణీలో బాధ్యతరాహిత్యం బయటపడిందని చెబుతున్నారు. ఇక్కడ విద్యార్థులకు అందించడానికి పంపిన యునిఫాంలోని 10 కి పైగా నిక్కర్లు వేరు వేరు రంగుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. సగ భాగం ఒకరంగు, మరోసగ భాగం మరో రంగు ఉండడంతో విద్యార్థులు వాటిని తీసుకునేందుకు నిరాకరించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని అంటున్నారు.



రెండు రంగులతో కనిపిస్తున్న నిక్కరు

మహిళల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

అమరచింత: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ కుటుంబాలను ఆర్థిక పురోగతిలో ముందుకు తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు సోమవారం వంట పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ మహిళా సమాఖ్య తరపున అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పొదుపు సంఘాల మహిళలకు వంటల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. వంట పోటీలో ప్రతిభ కనపర్చిన వారికి నగదు బహుమతులు అందిస్తున్నాన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు తిండి పదార్థాలకు అదిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అలాంటి సందర్భాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు సంఘాల సభ్యులు మంచి రుచికరమైన తిండి పదార్థాలను తయారు చేసి విక్రయించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. దీంతో పాటు క్యాటరింగ్ వసతిని నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన వారికి మున్సిపల్ ఆధ్వర్యంలో స్థలాలను కేటాయించి వారి ఆర్థిక పురోగతికి సహకరిస్తామని భరోసానిచ్చారు.

బల్బు వేడికి పత్తి దగ్ధం

ఊట్కూర్: మండలంలోని నిడుగుర్తి గ్రామంలో ఇంట్లో నిల్వ చేసిన పత్తి సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రైతు కుర్వ కర్రెప్ప పత్తిని ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. సోమవారం రాత్రి 9గంటల ప్రాంతంలో విద్యుత్తు బల్బు వేడికి పత్తికి నిప్పు అంటుకుంది. దీంతో కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే సుమారు 3 క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. దీంతో రూ.20వేల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పూడ్చివేత పనులు నిలిపివేయాలి

మరికల్: మండల కేంద్రంలోని ధర్మానకుంట పూడ్చివేత పనులను నిలిపివేయాలని యువక మండలి సభ్యులు, సర్పంచ్ గోవర్ధన్ సోమవారం తహసీల్దార్ రాంకోటికి వినతి పత్రాన్నిచ్చారు. మూడు రోజుల నుంచి రాత్రివేళలో కొందరు పూడ్చివేతకు పాల్పడుతున్నారని ఆయనకు వివరించారు. మరికల్‌కు వచ్చిన అడిషనల్ కలెక్టర్ మాయంక్ మిట్టల్ దృష్టికీ విషయాన్ని తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ కుంటను ఆక్రమించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రామస్వామి, కొండారెడ్డి, యువక మండలి అధ్యక్షులు రవికిరణ్, రవి, శేఖర్, రాఘవేంద్ర, సాగర్, నాగేష్, చందు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శ్రీశైలానికి భక్తుల పాదయాత్ర



శ్రీశైలానికి వెళ్తున్న భక్తులు

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లి గ్రామానికి చెందిన 38 మంది శివభక్తులు సోమవారం ఉగాది పండుగను పురస్కరించుకొని శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటా గ్రామం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాదయాత్రగా శ్రీశైలానికి ప్రయాణం అవుతారని పేర్కొన్నారు. గ్రామంలో పంటలు బాగా పండాలని, ఎవరికి ఏ ఇబ్బందులు రాకుండా సుఖసంతోషాలతో మెలగాలని ఆ శివుని ఆశీస్సులు గ్రామంపై ఉండాలని యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న బాలమేళా



బాలమేళాలో పాల్గొన్న అధికారులు, చిన్నారులు

దామరగిద్ద: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపర్‌వైజర్ రూప, సర్పంచ్ సత్యమ్మ, ఎంపీటీసీ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని బాపన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలమేళా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు ఎదుగుదలకు అందించాల్సిన పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. బాలమేళాలో చిన్నారులు వివిధ వేషాధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రథమ్ సూపర్‌వైజర్ కవిత, మాజీ ఎంపీటీసీ గోపాల్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, నర్సింగమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

మాగనూర్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు రెండవ దశ కార్యక్రమం మండలంలో కొనసాగుతోంది. వడ్వాట్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శిబిరం నిర్వహణపై ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వైద్య బృందానికి కంటి పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. కంటి సంబంధ సమస్యలు ఉన్న ప్రజలు శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు.



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

'పది' పరీక్షల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి

నారాయణపేట రూరల్ : విద్యార్థులు పదోతరగతి తుది పరీక్షల్లో సత్తాచాటి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని వక్తలు అన్నారు. పట్టణంలోని ఏయిడెడ్ వైదికోన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించిన సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా శక్తి పీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్, స్నేహమిత్రమండలి కన్వీనర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని పిల్లలే సర్వస్వంగా జీవిస్తున్న తల్లిదండ్రుల కలను విద్యార్థులు నిజం చేయాలన్నారు. సమయం వృథా చేయకుండా పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి డైట్ పాటించాలి, ఎంత సమయం చదువుకోవాలి, చదువుపట్ల ఇంట్రెస్ట్ ఎలా వస్తుందనే విషయాలను వైద్యులు తెలియచేశారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగాధర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ వెంకట్రాములు, ఉపాధ్యాయులు ఉదయకుమారి, అర్చన, రాహుల్, నాగేష్, రాధిక, గౌరి, అనిత, పద్మావతి, శిరీష పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నారాయణపేట టౌన్ : దామరగిద్ద మండలం కానుకుర్తికి చెందిన వెంకటేష్‌కు శస్త్రచికిత్స నిమిత్తం రూ.లక్షా 50 వేల విలువైన ఎల్‌ఓసీ మంజూరైంది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎల్‌ఓసీ పత్రాన్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, దామరగిద్ద మండల నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం వినియోగించుకోండి

ఊట్కూరు: గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ మండల అధ్యక్షుడు ఎల్కోటి జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



బైరంకొండలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

నారాయణపేట రూరల్ : మండలంలోని బైరంకొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్‌గా నవీన, డీఈఓగా మహేశ్వరి, ఎంఈఓగా పార్వతి, హెచ్‌ఎంగా వంశీ వ్యవహరించగా పలువురు టీచర్లుగా విధులు నిర్వర్తించారు. చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు హాజరై విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు. హెచ్ ఎం కందికొండ కృష్ణయ్య, టీచర్లు విద్యావతి, బా లప్ప, స్నేహలత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: మండల పరిధిలోని మీర్జాపూర్, బిజ్జారం ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అర్జున్, భాను ప్రకాష్‌తోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నర్వ: మండల కేంద్రంలోని ప్రతిభ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పాల్గొన్నారు.

దామరగిద్ద: బాపన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, గీత, సౌజన్య, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మాగనూర్(కృష్ణ): మండల పరిధిలోని గుడెబల్లూర్ మార్గదర్శి పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ప్రహ్లాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు వరప్రసాద్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, శ్రీలత, దినేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని శ్రీచైతన్య విద్యామందిర్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కాశయ్య పాల్గొన్నారు.



మీర్జాపూర్‌లో..



బాపన్‌పల్లిలో ..



నర్వలో..



ధన్వాడలో..